బలగం TV
BALAGAM

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 02 సెప్టెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## బతుకమ్మ పండుగను కార్నివాల్‌గా నిర్వహిస్తాం

- సెప్టెంబర్ 21 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు
- మంత్రి జూపల్లి కృష్ణారావు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బతుకమ్మ పండుగను ఈసారి ఘనమైన కార్నివాల్‌గా నిర్వహిస్తామని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. సోమవారం మంత్రులు కొండా సురేఖ, సీతక్కలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ, "సెప్టెంబర్ 21న వేయిస్తంభాల గుడిలో వేడుకలు ప్రారంభమవుతాయి. 29న ఎల్బీ స్టేడియంలో గిన్నిస్ బుక్ రికార్డ్స్ లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తాం" అని తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాలతో పీపుల్స్ ప్లాజాలో ప్రత్యేక వేడుకలు, రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల విద్యార్థుల భాగస్వామ్యంతో బతుకమ్మ వేడుకలు జరగనున్నాయని వెల్లడించారు. అంతేకాకుండా జాతీయస్థాయిలో బతుకమ్మకు ప్రచారం కల్పించేందుకు కొన్ని విమానయాన సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని చెప్పారు.

మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, "బతుకమ్మ ద్వారా రాష్ట్ర పర్యాటక రంగానికి పెద్ద ఎత్తున ప్రచారం కలుగుతుంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు మిగితా 4వ పేజీలో

# 4 ఏండ్ల స్థానికత తప్పనిసరి

- మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్, డెంటల్ కోర్సులలో ప్రవేశాలకు..
- తెలంగాణ ప్రభుత్వ జీవో 33ని సమర్థించిన సుప్రీంకోర్టు
- 9,10,11, 12 తరగతులు తెలంగాణలో చదవాల్సిందేనని తీర్పు
- గతంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేసిన సీజేఐ ధర్మాసనం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్, డెంటల్ కోర్సులలో ప్రవేశాలకు నాలుగేండ్లు స్థానికత తప్పనిసరి అని సర్వోన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. తెలంగాణలో మెడికల్ సీట్లు పొందాలంటే... 9, 10, 11, 12 తరగతి వరకు తెలంగాణలో చదవాల్సిందే అని తేల్చి చెప్పింది. ఈ నాలుగేండ్లు తెలంగాణలో చదివిన వాళ్లే మెడికల్ కోర్సు ప్రవేశాలకు స్థానికులుగా అర్హులని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. అందులో భాగంగా స్థానికత అంశంపై గతేడాది రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో 33ని సమర్థించింది. అలాగే తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి, డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను పక్కన పెడుతున్నట్టు స్పష్టం చేసింది. మెడికల్ కోర్సు అడ్మిషన్లకు స్థానికతకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో 33పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయంలు సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్ఎల్పీ) దాఖలు చేశాయి. ఈ పిటిషన్లపై గత నెల 5న జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని జస్టిస్ కె వినోద్ చంద్రన్ లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు సుమారు రెండు గంటల సుదీర్ఘ వాదనలు జరిగాయి. అనంతరం ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. సోమవారం ఈ పిటిషన్లపై 32 పేజీలతో కూడిన తీర్పును సీజేఐ ధర్మాసనం వెలువరించింది. హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును రద్దు చేస్తూ, 2017లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ నిబంధనలను, అలాగే 2024లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణను సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. అయితే గతేడాది స్థానికత అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించి సీట్లు పొందిన విద్యార్థులకు ఈ తీర్పు వర్తించదని కోర్టు స్పష్టం చేసింది. ధర్మాసనం ముందు ఉన్న అన్ని పిటిషన్లను డిస్మిస్ చేస్తున్నట్టు వెల్లడించింది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 371డీ ప్రకారం జారీ చేయబడిన 1974 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో 33 నిబంధనలున్నాయని కోర్టు పేర్కొన్నది. అలాగే ఆలిండియా కోటాలో 15 శాతం సీట్లు కేటాయించడాన్ని కూడా స్వాగతించింది. అలాగే ప్రభుత్వం రూల్ 3 కింద చేసిన సవరణలను కూడా పరిగణలోకి తీసుకున్నట్టు వెల్లడించింది. తద్వారా ఈ కింద సందర్భాల్లో నిబంధనల్లో ప్రత్యేక సడలింపులు ఇస్తున్నట్టు స్పష్టం చేసింది. అయితే మెడికల్ కోర్సుల్లో స్థానిక అభ్యర్థి క్యాటగిరీ కోటాలో సీటు పొందాలంటే... ఈ మినహాయింపులకు సంబంధించి అధికారులు ధృవీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. మిగితా 4వ పేజీలో

# విద్యుత్ సబ్ స్టేషన్ల పునర్నిర్మాణం పనులను వేగవంతం చేయాలి

- వరద నష్టంపై రెండురోజుల్లో నివేదిక
- ఆ వివరాలతో ఢిల్లీకి డిప్యూటీ సీఎం
- వరద సహాయక చర్యలు, మరమ్మతు పనుల్లో వేగం పెంచండి
- కలెక్టర్లకు రూ.10 కోట్ల నిధులు
- మృతుల కుటుంబాలకు తక్షణ సాయం
- నీటి సంఘాల పునరుద్ధరణపై నివేదిక ఇవ్వండి
- వరదలపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఇటీవలి భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న రోడ్లు, భవనాలు, చెరువులు, కుంటలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు విద్యుత్ సబ్ స్టేషన్ల పునర్నిర్మాణం పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర విపత్తు ఉపశమన నిధులు నిధులున్నా నిబంధనల ప్రకారం వాటిని వ్యయం చేయడంలో అలసత్వం చూపడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.భారీ వర్షాలు, వరదలతో తలెత్తిన పరిస్థితులు, ఆయా ప్రాంతాల్లో వాటిల్లిన నష్టాలపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి గారు ఉన్నత స్థాయి సమీక్ష, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

వరదల సమయంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు, పశువులు కోల్పోయిన కుటుంబాలకు తక్షణమే పరిహారం విడుదల చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. గతేడాది ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో వర్షాలతో వాటిల్లిన తీవ్ర నష్టానికి కేంద్రం నుంచి రావలసిన సహాయం అందకపోవడంపై ఆరా తీసిన ముఖ్యమంత్రి ఆ వివరాలతో పాటు ప్రస్తుత వరదల నష్టానికి సంబంధించిన వివరాలతో సమగ్రమైన నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని బృందం ఈ నెల 4 వ తేదీన ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి ఆ రెండు నివేదికలకు అందజేస్తుందని చెప్పారు. వరదల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 257 చెరువులు, కుంటలకు గండి పడినట్టు అధికారులు చెప్పగా, ముఖ్యమంత్రి గారు స్పందిస్తూ, చిన్న నీటి పారుదల విభాగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆర్ఆర్ఆర్, ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన, ఇతర కేంద్ర ప్రాయోజిత పథకాలను వినియోగించుకొని చిన్న నీటి వనరులకు మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టాలని సూచించారు.

గతంలో నీటి వినియోగదారుల సంఘాల ఆధ్వర్యంలో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, డిస్ట్రిబ్యూటరీల వారీగా సంఘాలు ఉండేవి. ఆ సంఘాలకు సంబంధించిన నిబంధనలు పరిశీలించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లు నూతన ప్రతిపాదనలతో నివేదిక సమర్పించాలని, దానిపై మంత్రివర్గంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. 82 మండలాల్లో 2.36 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు రూపొందించిన ప్రాథమిక అంచనాలపై స్పందిస్తూ రెండు రోజుల్లో పూర్తి వివరాలతో సమగ్ర నివేదిక సమర్పిస్తే కేంద్రం దృష్టికి తీసుకెళతామని చెప్పారు.

నీట మునిగిన సబ్ స్టేషన్ల స్థానంలో అధునాతన సామగ్రి, సామర్థ్యంతో కూడిన సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు. పురపాలక, పంచాయతీ రాజ్, జీహెచ్ఎంసీ పరిధిలో వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణపై సమీక్ష నిర్వహించి పరిష్కారంతో రావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గారికి సూచించారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా, పశు సంవర్ధక శాఖలు కూడా రెండు రోజుల్లో సమగ్ర నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. కామారెడ్డి, ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. సహాయక పనులు వేగవంతం చేయాలని, పరిహారాలు వెంటనే విడుదల చేయాలన్నారు. అన్ని శాఖలు ఎస్డీఆర్ఎఫ్ నిధులను సక్రమంగా వినియోగించడంతో పాటు సకాలంలో వినియోగితా పత్రాలు (యూసీ) సమర్పించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విపత్తు సమయాల్లో స్పందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా ఏర్పాటు చేసిన ఎస్డీఆర్ఎఫ్ దళాలు వరదల సమయంలో మెరుగైన సేవలు అందించాయని అభినందనలు తెలిపారు.

## తెలుగువాడికి అవకాశం వచ్చింది.. మద్దతివ్వండి

- రాజకీయంగా ఉన్న భిన్నాభిప్రాయాలను పక్కనపెట్టి సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలి
- సీఎం రేవంత్‌రెడ్డి

వివరాలు 4వ పేజీలో

## జాతీయ స్థాయిలో ఎన్ఈపీ రాష్ట్రంలో టీఈపీ

- కొత్త విద్యావిధానం రూపకల్పనకు కమిటీ
- చైర్మెన్‌గా కే కేశవరావు
- అక్టోబర్ 30 నాటికి నివేదిక సమర్పించాలి
- ఉత్తర్వులు విడుదల

వివరాలు 4వ పేజీలో

# అఫ్ఘానిస్థాన్‌లో భూకంపం బీభత్సం



- 800 మంది మృతి
- 2,500 మందికి పైగా గాయాలు

**బలగం టీవీ, కాబుల్**

అఫ్ఘానిస్థాన్‌లో ఆదివారం అర్ధరాత్రి సంభవించిన భారీ భూకంపం దేశాన్ని విషాదంలో ముంచేసింది. ఈ విపత్తులో మృతుల సంఖ్య 800 దాటగా, 2,500 మందికి పైగా గాయపడ్డారు. మొదట్లో 250 మంది మాత్రమే మృతిచెందారని, 500 మందికి గాయాలయ్యాయని అధికారులు ప్రకటించారు. కానీ శిథిలాల కింద నుంచి మరిన్ని మృతదేహాలు, గాయపడిన వారు బయటపడుతున్న కొద్దీ మృతుల సంఖ్య పెరుగుతోంది.

రిక్టర్ స్కేలుపై 6.1 తీవ్రతతో ఆదివారం రాత్రి కునార్, నంగర్‌హార్ రాష్ట్రాలను తాకిన భూకంపం పెను విధ్వంసాన్ని సృష్టించి అపార నష్టాన్ని మిగిల్చింది. నంగర్‌హార్ రాష్ట్రంలోని జలాలాబాద్ నగరానికి ఈశాన్యంగా 27 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఏర్పడింది. ఇది కేవలం ఎనిమిది కిలోమీటర్ల లోతులోనే ఏర్పడడంతో భారీ నష్టం వాటిల్లింది. నుర్ గుల్, సోకీ, వాత్పూర్, మనోగి, చపాదర్, చాకే, షిగాల్ జిల్లాలు బాగా దెబ్బతిన్నాయి. నంగర్‌హార్, లగ్మన్, నురిస్తాన్ రాష్ట్రాలకు కోలుకోలేని అపార నష్టం సంభవించింది. వందలాది నివాస గృహాలు పూర్తిగా కూలిపోవడమో లేదా దెబ్బతినడమో జరిగింది. మజర్ లోయలోని గ్రామాలన్నీ కొండచరియల కింద శిథిలమై పోయాయి. రహదారులు పూర్తిగా ఛిద్రమయ్యాయి. అఫ్ఘనిస్థాన్-పాకిస్తాన్ సరిహద్దుకు సమీపంలో ఉన్న ప్రాంతాలలో కూడా 4.0 తీవ్రతతో భూ ప్రకంపనలు సంభవించాయి. భూకంపం ధాటికి అనేక భవనాలు నామరూపాలు లేకుండా కూలిపోయాయి. వాటి కింద చిక్కుకుపోయిన క్షతగాత్రులను స్ట్రెచర్లపై మోసుకొచ్చి హెలికాప్టర్లలో ఆస్పత్రులకు తరలిస్తున్నారు. సహాయ పునరావాస కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు అన్ని బృందాలనూ రంగంలోకి దింపామని తాలిబాన్ హోం మంత్రిత్వ శాఖ ప్రతినిధి అబ్దుల్ మతేన్ క్వానీ తెలిపారు. భూకంపాలు, వరదలకు పెట్టింది పేరైన మారుమూల ప్రాంతాలకు సహాయక బృందాలు చేరుకుంటున్నాయని రాజధాని కాబూల్‌లో ఆరోగ్య అధికారులు చెప్పారు. 2022 జూన్ తర్వాత ఆఫ్ఘన్‌లో భారీ స్థాయిలో భూకంపం సంభవించడం ఇదే మొదటిసారి. గాయపడిన వారిని అంబులెన్సులలో తరలించేందుకు సైనికులు, వైద్య సిబ్బంది చేస్తున్న ప్రయత్నాలకు స్థానికులు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నారు.

భూకంపం ధాటికి కునార్ ప్రాంతంలోని మూడు గ్రామాలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. అనేక ఇతర గ్రామాలలో కూడా కోలుకోలేని విధంగా నష్టం జరిగింది. ఒక్క కునార్‌లోనే 600 మందికి పైగా చనిపోయారు. నంగర్‌హార్‌లో 12 మంది విగతజీవులయ్యారు. పాకిస్తాన్‌లోని ఖైబర్ పక్తూన్‌క్వా సరిహద్దున ఉన్న భూకంప ప్రభావిత ప్రాంతాలకు చేరుకున్న సహాయ సిబ్బంది శిథిలాల కింద చిక్కుబడిపోయిన వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారు. హెలికాప్టర్లతో పాటు 40 విమానాల ద్వారా క్షతగాత్రులను ఆస్పత్రులకు మిగితా 4వ పేజీలో

## శాసన మండలిలో పంచాయతీ రాజ్, మున్సిపల్ చట్ట సవరణ బిల్లులు ఆమోదం

- బీఆర్ఎస్ నిరసనల మధ్య బిల్లులు ఆమోదం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ శాసన మండలిలో గందరగోళం నెలకొంది. బీసీ రిజర్వేషన్ బిల్లుపై ప్రభుత్వం చర్చ జరుపుతుండగా, కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీబీఐ విచారణకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ సభ్యులు నిరసనకు దిగారు. మండలి ప్రారంభం అవ్వగానే బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ఛైర్మన్ పోడియం చుట్టూ ఆందోళన చేపట్టారు. "కాళేశ్వరం కమిషన్ బూటకం.. సీబీఐతో దోస్తీ, బీజేపీతో కుస్తీ.. కాంగ్రెస్-బీజేపీ నాటకం" అంటూ నినాదాలు చేశారు. "రాహుల్ కి సీబీఐ వద్దు, రేవంత్ కి సీబీఐ ముద్దు" అంటూ నినాదాలు చేశారు. అంతేకాక పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ పత్రాలను చించి ఛైర్మన్‌పై విసిరేశారు.

ఈ నిరసనల మధ్య బీసీ బిల్లును మంత్రి సీతక్క ప్రవేశపెట్టారు. బీఆర్ఎస్ సభ్యుల తీరుపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "పెద్దల సభలో అమర్యాదకర ప్రవర్తన అనేది సరికాదు. తప్పు చేయనప్పుడు విచారణ ఎదుర్కొనే ధైర్యం ఎందుకు చూపడం లేదు? సీబీఐ విచారణకు భయమెందుకు?" అని ప్రశ్నించారు. కావాలనే బీసీ రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవాలని బీఆర్ఎస్ చూస్తోందని ఆయన ఆరోపించారు. చివరికి బీఆర్ఎస్ నిరసనల మధ్యే పంచాయతీ రాజ్, మున్సిపల్ చట్ట సవరణ బిల్లులు, అల్లోపతిక్ బిల్లులను తెలంగాణ శాసన మండలి ఏకగ్రీవంగా ఆమోదించింది. బిల్లులు ఆమోదం పొందినట్టు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు.



## మూడు రోజుల పాటు భారీ వర్షాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం దిశ మార్చుకుందని దీంతో రాబోయే 24 గంటల్లో ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ ప్రభావంతో మూడు రోజుల పాటు ఉత్తర తెలంగాణలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళవారం రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వరంగల్ జిల్లాల్లో అక్కడక్క భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.ఆదిలాబాద్, జనగాం, కామారెడ్డి, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, నల్గొండ, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎల్లో అలర్ట్ ఇచ్చింది. ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఆరెంజ్ అలర్ట్ ఇవ్వగా పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## సీబీఐకి అప్పగించడమంటే ప్రాజెక్టు మూసివేతే


- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సీబీఐకి కాళేశ్వరం అప్పగించడం అంటే ప్రాజెక్టును మూసివేయడమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టును శాశ్వతంగా మూసివేసి గోదావరి జలాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులపాటు ఆందోళనలకు బీఆర్ఎస్ పిలుపునిచ్చిన నేపథ్యంలో కేటీఆర్ పార్టీ శ్రేణులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్ర చేస్తోంది. బీజేపీతో చేతులు కలిపి ప్రాజెక్టును ఎండబెట్టి పక్క రాష్ట్రాలకు నీటిని తరలించే యత్నం జరుగుతోంది" అని ధ్వజమెత్తారు.

"నిన్నటివరకు సీబీఐకి వ్యతిరేకంగా మాట్లాడిన రేవంత్ ఒక్కసారిగా ఎందుకు మాట మార్చారు? దీని వెనుక ఎవరు ఉన్నారు, వారి ఉద్దేశం ఏమిటో ప్రజలకు తెలియాలి. ఇది కచ్చితంగా కాంగ్రెస్, బీజేపీ కలసి ఆడుతున్న కుట్ర, కపట నాటకం" అని మండిపడ్డారు. సీబీఐ గానీ, ఏ ఇతర ఏజెన్సీ గానీ విచారణ జరిపినా భయపడేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. "కేసులు కొత్తేమీ కావు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్ని త్యాగాలైనా చేస్తాం. కేంద్రంతో చేతులు కలిపి రాష్ట్ర కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను ఎదుర్కొంటాం" అని కేటీఆర్ తెలిపారు.



## ఓట్ల చోరీపై హైడ్రోజన్ బాంబు లాంటి సమాచారం విడుదల చేస్తాం

- దేశానికి మోదీ మొహాన్ని చూపించలేరు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఓట్ల చోరీకి సంబంధించి త్వరలోనే హైడ్రోజన్ బాంబు లాంటి సమాచారాన్ని తమ పార్టీ విడుదల చేయబోతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వెల్లడించారు. ఆ సమాచారాన్ని తాము విడుదల చేశాక ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇక తన మొహాన్ని దేశానికి చూపించలేరన్నారు. హైడ్రోజన్ బాంబు అనేది ఆటమ్ బాంబు కంటే పెద్దదని, దాన్ని ఎదుర్కొనేందుకు బీజేపీ నేతలు సిద్ధంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. ఓట్ల చోరీతో ముడిపడిన వాస్తవాలను దేశ ప్రజలు తెలుసుకోబోతున్నారని రాహుల్ గాంధీ చెప్పారు. సోమవారం బిహార్‌లోని పాట్నాలో జరిగిన 'ఓటర్ అధికార్ యాత్ర' ముగింపు సమావేశంలో ఆయన ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. మిగితా 4వ పేజీలో

## హరీశ్‌రావు, సంతోష్ వల్లే

# కేసీఆర్‌కు అవినీతి మరక

- మా నాన్న ప్రజల కోసం పని చేస్తే.. వాళ్లిద్దరూ ఆస్తుల కోసం పని చేశారు
- ఇంత జరిగాక పార్టీ ఉంటే ఎంత? పోతే ఎంత?
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**


కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై రాష్ట్ర రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "కాళేశ్వరంలో చిన్న భాగం కుంగితే మొత్తం ప్రాజెక్టును అవినీతి కప్పేస్తున్నట్లు చేస్తున్నారు. కెసిఆర్‌కు అవినీతి మరక అంటిపెట్టుకోవడానికి కారణం హరీశ్‌రావు, సంతోష్, మేఘా ఇంజినీరింగ్" అని ఆరోపించారు.కవిత మాట్లాడుతూ, "ఐదేళ్లు ఇరిగేషన్ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు పాత్ర ఎందుకు దాటవేయాలి? ఆయన, సంతోష్ పెద్ద కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారు. అందుకే రెండోసారి మంత్రివర్గంలోకి తీసుకోలేదు. కెసిఆర్ ప్రజల కోసం పనిచేయగా, వీరు సొంత ఆస్తుల కోసం పనిచేశారు" అని విమర్శించారు.

"హరీశ్‌రావు, సంతోష్‌లు నాపై ఎన్నో కుట్రలు చేశారు. వ్యక్తిగత దాడులు చేశారు. అయినా నేను నోరు మెదపలేదు. కానీ ఇప్పుడు నా తండ్రి పరువుపై దాడి చేస్తున్నారు. రేవంత్ రెడ్డి వీరి వెనక ఉన్నారు. రేవంత్, హరీశ్‌రావు, సంతోష్‌ల మధ్య లోపాయకారి ఒప్పందం ఉంది" అని కవిత ఆరోపించారు."కెసిఆర్ మీద సీబీఐ దర్యాప్తు వేశాక పార్టీ ఉంటే ఏమిటి, లేకుంటే ఏమిటి? ఇది నా తండ్రి పరువుకు సంబంధించిన విషయం. ఈ వయస్సులో ఆయన ఎందుకు విచారణ ఎదుర్కోవాలి? సీబీఐ విచారణకు కారణం హరీశ్‌రావు, సంతోష్" అని కవిత తెలిపారు. కాళేశ్వరం ఇంజినీర్ల వద్ద వందల కోట్ల ఆస్తులు ఉన్నాయని, కానీ వారిపై విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. "ఎసిబికి చిక్కిన ఇంజినీర్ల వెనుక ఎవరున్నారో ఎందుకు బయటపెట్టడం లేదు? హరీశ్‌రావు, సంతోష్ వెనుక రేవంత్ రెడ్డి ఉన్నందువల్లే కాపాడుతున్నారు" అని ఆరోపించారు.

"కెసిఆర్ జీవితాంతం డబ్బుపై ఆశపడలేదు. కానీ ఇప్పుడు ఆయనకు అవినీతి మరక అంటించేందుకు కుట్ర జరుగుతోంది. బీఆర్ఎస్ శ్రేణులకు నా మాటలు చేదుగా అనిపించవచ్చు. కానీ అప్పుడప్పుడూ వాస్తవం మింగితేనే ఆరోగ్యానికి మంచిది" అని కవిత వ్యాఖ్యానించారు.

# షాంఘైలో మైత్రీబంధం

- చైనాలో మోడీ, జిన్‌పింగ్, పుతిన్‌ల కలయిక
- ఉగ్రవాదంపై నిర్ణయాత్మక చర్యలు : నరేంద్ర మోడీ
- ఉక్రెయిన్ యుద్ధానికి ఆజ్యం పోసింది అమెరికానే : పుతిన్
- ప్రచ్ఛన్న యుద్ధ మనస్తత్వాన్ని వ్యతిరేకించండి : ఎస్‌సీఓ సదస్సులో జిన్‌పింగ్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అమెరికాతో అంతంత మాత్రంగానే సంబంధాలు కలిగిన భారత్, చైనా, రష్యా దేశాల నేతలు పరస్పరం చేతులు కలిపారు. కరచాలనాలు, చిరునవ్వులు, ఆలింగనాలతో సన్నిహితంగా మెలిగారు. ప్రధాని నరేంద్ర మోడీ, చైనా, రష్యా అధ్యక్షులు జిన్‌పింగ్, వ్లాదిమిర్ పుతిన్ కొద్దిసేపు ముచ్చటించుకున్నారు. ఈ ఆసక్తికర దృశ్యానికి చైనాలో జరుగుతున్న షాంఘై సహకార సదస్సు (ఎస్‌సీఓ) వేదికైంది. సదస్సు ముగిసిన తర్వాత మిగితా 4వ పేజీలో

# బీసీలకు రిజర్వేషన్ల పెంపు బిల్లును గవర్నర్ ఆమోదించాలి

- అసెంబ్లీలో బీసీ బిల్లు ఆమోదం పట్ల సర్వత్ర హర్షం..
- స్థానిక సంస్థలలో బీసీలకు రిజర్వేషన్ల అమలుకు కాంగ్రెస్ చేస్తున్న కృషికి హాట్సాఫ్..
- పార్టీల చిత్తశుద్ధిని బీసీలు గమనిస్తున్నారు..
- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపు బిల్లును గవర్నర్ వెంటనే ఆమోదించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సోమవారం రోజున ప్రెస్ క్లబ్‌లో జరిగిన బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. ఈ సమావేశం తడక కమలాకర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పర్ష హన్మాండ్లు మాట్లాడుతూ.. 2018 పంచాయతీరాజ్ చట్టానికి సవరణలు చేసి, 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తూ అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానించడం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీతక్క, కొండా సురేఖలతో పాటు అన్ని పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే కసి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉందని, దీని పట్ల హర్షం వ్యక్తం చేశారు.

కొన్ని రాజకీయ పార్టీలు ఈ విషయంలో గోడమీద పిల్లిలా వ్యవహరిస్తున్నాయని, బీసీ సమాజం అంతా గమనిస్తోందని ఆయన హెచ్చరించారు. ఈ రిజర్వేషన్ల అంశం బీసీలకు నోటికి బుక్కలాగా దగ్గరగా వచ్చిందని, దీనిని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తే ఊరుకోమని, ఆరు నూరైనా బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించి తీరుతామని స్పష్టం చేశారు. జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజ్యాధికారం వాటా దక్కాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిని రాజకీయం చేయదలచుకోలేదని, ఇంకా నాన్చివేస్తే తెలంగాణ ఉద్యమాన్ని ఆదర్శంగా తీసుకొని బీసీ కుల సంఘాలు, విద్యార్థులు, ఉద్యోగులు, రాజకీయ నాయకులు, మేధావులతో జేఏసీగా ఏర్పడి రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని హన్మాండ్లు హెచ్చరించారు. ఈ సమావేశంలో తడక కమలాకర్, కంచర్ల రాజు, చొక్కి కైలాసం, కొడం రవీందర్, సామల తిరుపతి, దండు శ్రీనివాస్, ఇల్లంతకుంట తిరుపతి, బూర ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులపై కపటప్రేమను మానుకోండి..



**జిల్లా ఉపాధ్యక్షులు సంగ స్వామి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రైతులపై కపట ప్రేమను మానుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ నాయకులు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రైతుల పక్షపాతిగా ఉంటుందని, ఇప్పటికే రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ చేసి రైతుల చరిత్రలో నిలిచిపోయిందని సంగ స్వామి (జిల్లా ఉపాధ్యక్షులు) మరియు కనికరపు రాకేష్ (మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్) స్పష్టం చేశారు. బీజేపీపై మాట్లాడే ధైర్యం లేని బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లడం సిగ్గుచేటని వారు అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం చేసిన తప్పుల వల్లే యూరియా కొరత ఏర్పడిందని సాక్షాత్తు బీజేపీ ఎంపీ రఘునందన్ రావు చెబుతున్నా, బీఆర్ఎస్ నాయకులకు కళ్ళు కనిపించడం లేదా అని వారు ప్రశ్నించారు.

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంత ఎమ్మెల్యేగా ఉన్న రమేష్ బాబు ఈ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోకుండా విదేశాల్లో విలాసవంతమైన జీవితం గడిపారని వారు గుర్తుచేశారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత కేసీఆర్‌ది కాదా అని వారు నిలదీశారు.

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 18 నెలల్లో ఈ ప్రాంతంలో అన్ని విధాలా అభివృద్ధి జరుగుతుందని వారు తెలిపారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేపట్టిన మర్రిపల్లి, కలికోట సూరమ్మ ప్రాజెక్ట్, లచ్చంపేట చెరువు వంటి పనులను ఓర్వలేకనే బీఆర్ఎస్ ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. గతంలో రైతుల చేతులకు సంకెళ్లు వేసి, యూరియా కోసం క్యూలో నిలబడి గుండెపోటుతో చనిపోయిన రైతులను పట్టించుకోని మీరు, ఇప్పుడు రైతుల గురించి మాట్లాడడం హాస్యాస్పదమని వారు అన్నారు. బర్రెల, గొర్రెల, కాళేశ్వరం, లిక్కర్, ఈ-కార్ రేస్ వంటి స్కామ్‌లతో రాష్ట్రాన్ని దోచుకున్న ఘనత కేసీఆర్‌ది కాదా అని వారు ప్రశ్నించారు.

ఎన్ని రకాలుగా రెచ్చగొట్టినా రైతులు బీఆర్ఎస్ మాటలను నమ్మరని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీ పూర్తిగా కనుమరుగు కావడం ఖాయమని వారు జోస్యం చెప్పారు. వచ్చే పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటుందని వారు ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతులను రెచ్చగొట్టడం మానుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రుద్రంగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, డైరెక్టర్ మానుపాటి పర్శరాములు, మాజీ ఉపసర్పంచ్ అక్కేనపల్లి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# తండ్రి వాహనం కిందపడి బాలుడు మృతి

## అబ్దుల్లాపూర్ మెట్‌లో విషాద ఘటన

**బలగం టీవీ, హైదరాబాద్**

క్షణ కాలం ముందే అల్లారుముద్దుగా ఆడుకుంటున్న బాలుడు బంతి కోసం వెళ్లి తండ్రి నడిపే ఆటో ట్రాలీ చక్రాల కింద పడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం, అదే గ్రామానికి చెందిన కల్లెం నరేష్ డ్రైవర్. భార్య పిల్లలతో కలిసి రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం లష్కర్ గూడ గ్రామం వెళ్లే రోడ్డు సమీపంలో ఉంటూ గూడ్స్ వాహనం నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం ఉదయం లష్కర్ గూడ రోడ్డులో ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా నరేష్ గూడ్స్ వాహనాన్ని రివర్స్ తీస్తుండగా బంతితో ఆడుకుంటున్న అతని 13 నెలల కుమారుడు కల్లెం రోహిత్ ఆకస్మాత్తుగా వాహనం కిందకు వచ్చి టైర్ల కిందపడడంతో తలకు గాయమైంది. అధిక రక్తస్రావం అవ్వడంతో బాలుడు అక్కడికక్కడే మతి



చెందాడు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం బాలుని మతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# చంద్రగ్రహణం కారణంగా సెప్టెంబర్ 7, 8 తేదీలలో ఆలయ దర్శన వేళల్లో మార్పులు

**బలగం టీవీ, వేములవాడ**

ఈ నెల 07-09-2025 ఆదివారం నాడు సంభవించనున్న చంద్రగ్రహణం దృష్ట్యా, ఆలయ దర్శన వేళల్లో మార్పులు చేసినట్లు ఆలయ నిర్వాహణాధికారి తెలిపారు. గ్రహణం కారణంగా ఆదివారం ఉదయం 11:25 గంటల వరకు మాత్రమే భక్తులకు స్వామివారి దర్శనం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఆ తర్వాత ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలన్నీ తాత్కాలికంగా మూసివేయబడతాయి. గ్రహణం ముగిసిన తర్వాత, సోమవారం ఉదయం 3:45 గంటల నుంచి ఆలయంలో సంప్రోక్షణ కార్యక్రమాలు జరుగుతాయి. ఆ తర్వాత సుప్రభాతం, ప్రాతఃకాల పూజల అనంతరం భక్తుల దర్శనానికి ఆలయం తిరిగి తెరచుకుంటుంది అన్నారు. ఆ రోజు నుంచి అన్ని నిత్యపూజలు యథావిధిగా జరుగుతాయని నిర్వాహణాధికారి వెల్లడించారు. భక్తులు ఈ మార్పులను గమనించి తమ దర్శన కార్యక్రమాలను ప్లాన్ చేసుకోవాలని ఆయన సూచించారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో మద్యం దుకాణాలు 3 రోజుల పాటు మూసివేత..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

వినాయక నిమజ్జనం సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కీలక ఆదేశాలు జారీ చేశారు. సెప్టెంబర్ 4వ తేదీ ఉదయం 6 గంటల నుంచి సెప్టెంబర్ 7వ తేదీ ఉదయం 6 గంటల వరకు జిల్లాలోని అన్ని మద్యం దుకాణాలు, బార్లు, రెస్టారెంట్లు, కల్లు దుకాణాలు, కల్లు డిపోలు మూసివేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ మూడు రోజుల పాటు ఈ ఆంక్షలు కఠినంగా అమలవుతాయని, నిమజ్జన వేడుకల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని లైసెన్స్ పొందిన దుకాణాల యజమానులు ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీసులు కూడా వెల్లడించారు.



# రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

**బలగం టీవీ, వేములవాడ**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండల భారతీయ జనతా పార్టీ పక్షాన నంది కమాన్ చౌరస్తాలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేయబోతుందండగా పోలీస్ అధికారులు అడ్డుకొన్నారు. భవిష్యత్ లో ఇలాంటి వాక్యాలు చేస్తే భారతీయ జనతా పార్టీ పక్షాన తీవ్రపరిణామాలు ఉంటాయని వేములవాడ మండల, అర్బన్ మండల అధ్యక్షులు శేఖర్ గౌడ్ హెచ్చరించారు.



# గణనాథునికి పిండి వంటలు నైవేద్యంగా సమర్పించిన భక్తులు

**బలగం టీవీ, బోయినిపల్లి**

బోయినిపల్లి మండలం తడగొండ గ్రామంలో శ్రీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, వినాయకుడికి 60 రకాల పిండి వంటలు నైవేద్యంగా సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తర్వాత దేవుని ఆశీస్సులు తీసుకున్నారు.

# ఎల్లారెడ్డిపేట మండల బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధిగా దండు శ్రీనివాస్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామానికి చెందిన దండు శ్రీనివాస్‌ను ఎల్లారెడ్డిపేట మండల బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధిగా నియమిస్తూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు ఉత్తర్వులు జారీ చేశారు. బీసీ సంక్షేమ సంఘం అభివృద్ధికి దండు శ్రీనివాస్ కృషి చేస్తారనే నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినట్లు హన్మాండ్లు తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా దండు శ్రీనివాస్ మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు, అలాగే నాయకులు కంచర్ల రాజు, బండారు బాల్‌రెడ్డి, తడక కమలాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.



## వేకువజామునే యూరియా కోసం..

- పడిగాపులు కాస్తున్న రైతులు
- ఉదయం 3 గంటల నుండే మండల కేంద్రంలో రైతుల దర్శనం

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

యూరియా బస్తాల కోసం రైతులకు తిప్పలు తప్పట్లేదు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో రాత్రి సమయంలో యూరియా బస్తాల లారీ లోడ్ వచ్చిందనీ తెలుసుకున్న రైతులు వేకువజామునే 3 గంటల నుండే యూరియా విక్రయ కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఇక ప్రైవేటు దుకాణ వ్యాపారస్థులు మాత్రం వారికి రెగ్యులర్ గా ఉండే అసాములకు మాత్రమే బస్తాలు ఇస్తామని చెప్పడం తో దిక్కుతోచని పరిస్థితి లో రైతు దిగాలు చెందుతున్నాడు. పంటకు అందించాల్సిన సమయానికి యూరియా అందక పోవడంతో ఈ సారి పత్తి పంట గానీ, వరి పంటలు దిగుబడి తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ అమలు చేయాలి

### -సిరిసిల్ల కలెక్టరేట్ ముందు నల్ల చౌక్కా, నల్ల బ్యాడ్జిలతో ఉద్యోగుల జేఏసీ నిరసన

**బలగంటివి, రాజన్న సిరిసిల్ల:**

సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాజన్న జిల్లా కలెక్టరేట్ ముందు టి జి ఈ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్ల చౌక్కా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఎలుసానీ ప్రవీణ్ కుమార్, కన్వీనర్ సమర సేన్, కార్యదర్శులు సయ్యద్ జబి, గాజుల సుదర్శనం మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందు పరిచిన అంశం సీపీఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ ను అమలు చేస్తామని ఇచ్చిన ఇప్పటి వరకు పి ఆర్ సి అమలు కాలేదని, డి. ఎ, పెండింగ్ బిల్లులు అలాగే ఉన్నాయని విటన్నిటిపై దశల వారీగా ఉద్యమాలు చేయడానికి రాష్ట్ర కమిటీ పిలుపు ఇచ్చిందని అన్నారు. సెప్టెంబర్ 1 నుండి పెన్షన్ విద్రోహ దినం నిరసన కార్యక్రమానికి సిరిసిల్ల కలెక్టర్




కార్యాలయానికి అనేక సంఘాల నుండి ఉద్యోగులు నల్ల చౌక్కా లతో తరలి వచ్చారని, అదే విధంగా హైదరాబాద్ లో భారీ ఎత్తున నిర్వహిస్తున్న సభకు జిల్లా నుండి నాయకులు పాల్గొనడానికి వెళుతున్నట్లు తెలిపారు. ఇక్కడ టీఎన్జీవో అసోసియేట్ ప్రెసిడెంట్ మెట్ట శ్రీకాంత్, కోశాధికారి ఎం.డి రియాజ్ పాషా, టీ. జీ. ఒ అసోసియేటెడ్ ప్రెసిడెంట్ జోగం రాజు, కోశాధికారి అహ్మద్ రసూల్, జాయింట్ సెక్రటరీ . శ్రీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ. సాగర్, మహిళ ఉపాధ్యక్షురాలు జానకి, ట్రెసా అధ్యక్షులు జయంత్ కుమార్, ఎ. ఇ. ఇ అధ్యక్షులు ఎం. వెంకట్ రెడ్డి ఎ. ఇ. వో అధ్యక్షులు లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షులు అనిల్, ఎ. ఎస్. వో అధ్యక్షులు సుమన్, నాలుగో తరగతి జిల్లా అధ్యక్షులు జీవన్, దేవాదాయ శాఖ ఫోరమ్ అధ్యక్షులు ఎడ్ల శివకుమార్, సభ్యులు అధ్యాపకులు. శేఖర్, గోపి, జయభారత్ రెడ్డి తదితర శాఖల అధికారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# బ్యాంక్‌నే దొంగలించిన బ్యాంక్ మేనేజర్..

- ఎస్‌బీఐ చెన్నూర్‌లో భారీ మోసం
- రూ.12.61 కోట్ల విలువైన బంగారం, నగదు అపహరణ 4
- 44 మంది అరెస్ట్..

**బలగం టీవీ, చెన్నూర్**

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) చెన్నూర్ బ్రాంచ్‌లో జరిగిన భారీ గోల్డ్ లోన్ మరియు నగదు మోసం కేసును రామగుండం పోలీస్ కమిషనరేట్ ఛేదించింది. ఇందులో బ్రాంచ్ మేనేజర్, క్యాషియర్‌తో సహా మొత్తం 44 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.




2025 ఆగస్టు 23న, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ రితేష్ కుమార్ గుప్తా ఇచ్చిన ఫిర్యాదుతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. బ్యాంకులో 402 గోల్డ్ లోన్ ఖాతాలకు చెందిన రూ.12.61 కోట్ల విలువైన 25.17 కిలోల బంగారం, మరియు రూ.1.10 కోట్ల నగదు అపహరణకు గురయ్యాయి. ఫిర్యాదు అందిన వెంటనే రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు, డీసీపీ మంచిర్యాల్ ఏ. భాస్కర్ పర్యవేక్షణలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఏసీపీ జైపూర్ ఏ. వెంకటేశ్వర్‌కు దర్యాప్తు బాధ్యతలు అప్పగించారు.

దర్యాప్తులో భాగంగా, ప్రధాన నిందితుడు క్యాషియర్ నరిగె రవీందర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, ఈ కుంభకోణం వెనుక ఉన్న పూర్తి వివరాలు బయటపడ్డాయి. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో రూ.40 లక్షలు నష్టపోయిన రవీందర్, తన అప్పులు తీర్చుకోవడానికి మరియు బెట్టింగ్ కొనసాగించడానికి బ్రాంచ్ మేనేజర్ వెన్నపురెడ్డి మనోహర్ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి లక్కాకుల సందీప్‌తో కలిసి ఈ మోసానికి పాల్పడ్డాడు. బ్యాంక్ కరెన్సీ చెస్ట్ తాళం మేనేజర్, క్యాషియర్ సంయుక్త ఆధీనంలో ఉండగా, మేనేజర్ మనోహర్ తన తాళాన్ని రవీందర్‌కు ఇచ్చాడు. రవీందర్, తన ఇద్దరు సహచరుల సహకారంతో అక్టోబర్ 2024 నుంచి గోల్డ్ లోన్ చెస్ట్ నుండి బంగారాన్ని దొంగిలించడం ప్రారంభించాడు. ఈ బంగారాన్ని తన స్నేహితులైన కొంగోండి బీరష్, కొడాటి రాజశేఖర్, మరియు బొల్లి కిషన్ (అందరూ ఎస్‌బీఎఫ్‌సీ మంచిర్యాల్ ఉద్యోగులు)కు అప్పగించేవాడు. వీరు ఆ బంగారాన్ని వివిధ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలలో (ముఖ్యంగా ఎస్‌బీఎఫ్‌సీ, ఇండెల్ మనీ, ముత్తూట్ ఫైనాన్స్, గోదావరి అర్బన్, మణప్పురం వంటివి) 44 మంది వ్యక్తుల పేర్లపై తాకట్టు పెట్టి, డబ్బును వారి ఖాతాల్లోకి బదిలీ చేసి కొంత కమిషన్ తీసుకుని మిగతా మొత్తాన్ని రవీందర్‌కి పంపేవారు. ఇంతేకాకుండా, క్యాషియర్ రవీందర్ బ్రాంచ్ మేనేజర్‌తో కలిసి తన కుటుంబ సభ్యులు, స్నేహితుల పేర్లపై 42 తప్పుడు గోల్డ్ లోన్ ఖాతాలను సృష్టించాడు. బంగారం లేకుండానే 4.14 కిలోల బంగారం తాకట్టు పెట్టినట్లు చూపించి రూ.1.58 కోట్లు విత్‌డ్రా చేసుకున్నాడు. అలాగే, ఎటిఎంలలో నగదు నింపే సమయంలో కూడా రవీందర్ డబ్బును దొంగిలించేవాడు.

పోలీసులు ఇప్పటివరకు మొత్తం 44 మంది నిందితులను అరెస్టు చేశారు. ఇందులో ముగ్గురు బ్యాంకు ఉద్యోగులు ఉన్నారు. దర్యాప్తులో భాగంగా, ఎస్‌బీఎఫ్‌సీ, ఇండెల్ మనీ, గోదావరి అర్బన్, ముత్తూట్ మినీ, మరియు ఐఐఎఫ్ఎల్ కంపెనీల నుండి 15.237 కిలోల బంగారు ఆభరణాలు మరియు రూ.1,61,730/- నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మిగిలిన బంగారాన్ని ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, మణప్పురం మంచిర్యాల, ముత్తూట్ ఫిన్‌కార్ప్, ముత్తూట్ ఫైన్ చెన్నూర్, మరియు ముత్తూట్ మినీ చెన్నూర్ వంటి కంపెనీల నుండి స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. ఈ మోసంలో గోల్డ్ లోన్ కంపెనీ మేనేజర్ల పాత్రపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో నరిగె రవీంధర్, వెన్నపురెడ్డి మనోహర్, లక్కాకుల సందీప్, కొంగొండి బీరేష్, కోదాటి రాజశేఖర్, బొల్లి కిషన్ కుమార్, ఉమ్మాల సురేష్, నడిగొట్టు సాగర్, రాంశెట్టి చంద్రబాబు, భరతపు రాకేష్, దిగుట్ల సునీల్, కడం రమేష్, దారపు నాగరాజు, నిట్టూరి రాజు, కంబాల మహేష్, కంది మల్లేష్, జూపాక సత్యనారాయణ, దయ్యాల మహేందర్, ఉరుగుండ పరంధాములు, కుమ్మరి నగేష్, మహ్మద్ రషీద్, దాడి రాజ్‌కుమార్, కన్నం రాకేష్, నేరడిగొండ అనిల్ సాయి, దుర్కి ప్రవీణ్ కుమార్, బొడ్డుపల్లి ప్రశాంత్, మంతెన రాజశేఖర్, కొమ్ము మహేష్, పంచల శశిధర్, దుర్గం మనోహర్, జాకవర్ మహేష్, మహమ్మద్ హబీబ్ పాషా, జంగంపల్లి యుంగేందర్, మహమ్మద్ సమీరుద్దీన్, మోతుకూరి శ్రీనివాస్, తాళ్లండి అంజయ్య, నిమ్మతి సుమ, పాణి రవళిఖా, ఈసంపల్లి సాయికిరణ్, నరిగె స్వర్ణలత, గౌడ సుమన్, తుండ్ల సురేష్, జుర్రు శ్రీనివాస్, తుంగపిండి శేఖర్, నరిగె సరిత, మోతుకూరి రమ్య, అగిడి మొగిలి లు మొత్తం 47 మంది నిందుతులు ఉన్నారు. ఈ కేసును తక్కువ కాలంలోనే చాకచక్యంగా ఛేదించి నందుకు ఏ. భాస్కర్, ఐపీఎస్ డీసీపీ మంచి ర్యాల్, ఏ. వెంకటేశ్వర్ ఏసీపీ జైపూర్, దేవేందర్ రావు ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ చెన్నూర్, ఆర్. బన్సీలాల్ సీఐ చెన్నూర్ రూరల్, డి. వేను చందర్ సీఐ శ్రీరాంపూర్, ఏ. ఆశోక్ సీఐ మంచిర్యాల్ రూరల్, కె.నరేష్ కుమార్ ఇన్స్పెక్టర్ %భౌూ%, బాబురావు ఇన్స్పెక్టర్ %జజూ%, ఎస్ ఐలైన పి. సుబ్బారావు, శ్రీధర్, రాజేందర్, శ్వేత, సంతోష్, లక్ష్మి ప్రసన్న, కోటేశ్వర్, ఉపేందర్ రావు, చంద్రశేఖర్, రవి, హెడ్ కానిస్టేబుళ్లైన శంకర్, రవి, పీసీలైన రమేష్, ప్రతాప్, తిరుపతి, లింగమూర్తి, సిబ్బందులు తదితరులను రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అభినందించారు.



## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

- గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 32 ఫిర్యాదులు స్వీకరణ
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఐపీఎస్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్. బి.గితే ఐపీఎస్ తెలిపారు. గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 32 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.



## శ్రీ కృష్ణ యాదవ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్ గ్రామంలో శ్రీ కృష్ణ యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ పెద్దలు, యాదవ సంఘం సభ్యుల సమక్షంలో జరిగిన ఎన్నికల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొలవేని ఎల్లం యాదవ్ను, ఉపాధ్యక్షుడిగా బోడపట్ల బాబును ఎన్నుకున్నారు. అలాగే, ప్రధాన కార్యదర్శిగా జక్కుల రాజు, కోశాధికారిగా జక్కుల తిరుపతి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా వర్కల ఆంజనేయులు, బొలవేని కళ్యాణ్, బోడపట్ల సాయి కుమార్, వర్కల దేవరాజు, ముచ్చర్ల పోచయ్యను సంఘ సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని అభినందించిన సంఘ సభ్యులు, యాదవులు రాజకీయంగా, సామాజికంగా మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం గ్రామాభివృద్ధికి, యాదవుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు.

# తెలుగువాడికి అవకాశం వచ్చింది.. మద్దతివ్వండి

- రాజకీయంగా ఉన్న భిన్నాభిప్రాయాలను పక్కనపెట్టి సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలి
- సీఎం రేవంత్‌రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్



ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రకటించామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇండియా కూటమి ఆలోచనను ఆయన గౌరవించారని చెప్పారు. హైదరాబాద్‌లో జస్టిస్ సుదర్శన్‌రెడ్డితో కలిసి సీఎం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

"ఇప్పుడు ఉపరాష్ట్రపతి ఎన్నికకు అత్యంత ప్రాధాన్యత ఉంది. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేయాలనే ఎజెండాతో ఎన్డీయే అభ్యర్థిని పెట్టింది. రాజ్యాంగాన్ని పరిరక్షించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో ఇండియా కూటమి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని బరిలోకి దింపింది. ఎన్నికలు, రాజకీయాలు, వివాదాలపై ఎప్పుడైనా మాట్లాడుకోవచ్చు. కానీ.. తెలుగువాడికి ఇప్పుడొక అవకాశం వచ్చింది. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మాజీ సీఎంలు కేసీఆర్, జగన్, ఎంఐఎం అధ్యక్షుడు అక్బరుద్దీన్ ఒవైసీలకు విజ్ఞప్తి చేస్తున్నా. రాజకీయంగా ఉన్న భిన్నాభిప్రాయాలను పక్కనపెట్టి సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలి"అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# షాంఘైలో మైత్రీబంధం

(మొదటి పేజీ తరువాయి)

మోడీ, పుతిన్ దాదాపు 40 నిముషాలపాటు ద్వైపాక్షిక సంబంధాలతో పాటు పలు అంశాలపై చర్చలు జరిపారు. రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకుంటోందన్న కారణంతో భారత్‌పై అమెరికా 50 శాతం సుంకాలు విధించిన తర్వాత ఇరువురు నేతలు సమావేశం కావడం ఇదే మొదటిసారి. భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం నాడే జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. వారిద్దరూ సహకార సదస్సుకు ఒకే కారులో చేరుకున్నారు. సదస్సు ముగిసిన అనంతరం చర్చల నిమిత్తం పుతిన్‌తో కలిసి వెళ్లిపోయారు. పుతిన్‌ను కలవడం ఎల్లప్పుడూ సంతోషంగానే ఉంటుందని మోడీ వ్యాఖ్యానించారు. పుతిన్, జిన్‌పింగ్‌తో కలిసి ఉన్న చిత్రాలను సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో మోడీ పోస్ట్ చేశారు. 'తియాంజిన్ చర్చలు కొనసాగుతాయి. ఎస్‌సీఓ సదస్సు సందర్భంగా పుతిన్, జిన్‌పింగ్‌తో అభిప్రాయాలు పంచుకున్నాను' అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. పుతిన్, మోడీ పరస్పరం చేతులు కలిపి నడుస్తూ, జిన్‌పింగ్ వద్దకు వెళ్లారు. అందరూ చిరునవ్వులు చిందిస్తూ ముచ్చటించుకున్నారు.

ఉగ్రవాదంపై పోరు విషయంలో దృఢమైన, నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకోవాలని సదస్సుకు హాజరైన నేతలను మోడీ కోరారు. పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో భారత్‌కు సంఘీభావం తెలిపినందుకు సభ్య దేశాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో 'ద్వంద్వ ప్రమాణాలు' పాటించరాదని సూచించారు. సీమాంతర ఉగ్రవాదానికి పాల్పడే దేశాలను, మద్దతు ఇస్తున్న దేశాలను బాధ్యులను చేయాలని కోరారు. ఉగ్రవాదం కారణంగా భారత్ నాలుగు దశాబ్దాలుగా నష్టపోతోందన్నారు. అనేక మంది తల్లులు తమ పిల్లల్ని కోల్పోయారని చెప్పారు. 'ఇటీవలే పహల్గాంలో ఉగ్రవాద వికృత రూపాన్ని చూశాము. ఆ సంక్షోభ సమయంలో మాకు మద్దతు తెలిపిన స్నేహితులకు కృతజ్ఞతలు. ఇది భారత భూభాగంపై జరిగిన దాడి మాత్రమే కాదు. మానవత్వంపై నమ్మకం ఉంచే ప్రతి దేశానికీ బహిరంగ సవాలే. కొన్ని దేశాలు ఉగ్రవాదానికి బాహాటంగా మద్దతు ఇవ్వడం ఎంతవరకు సబబు?' అని ప్రశ్నించారు. ఏ దేశం అభివృద్ధి చెందాలన్నా భద్రత, శాంతి, స్థిరత్వం కీలకమని చెప్పారు. అయితే ఆ దారిలో ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదం అనేవి పెను సవాలుగా నిలిచాయని అన్నారు. ఉగ్రవాదం మానవత్వానికే సవాలు విసురుతోందనీ, దానిపై పోరులో ఐక్యత అవసరమని స్పష్టం చేశారు.

షాంఘై సదస్సుకు హాజరైన సభ్య దేశాలన్నీ పహల్గాం ఉగ్రదాడిని ముక్తకంఠంతో తీవ్రంగా ఖండించాయి. ఈ దాడిలో చనిపోయిన, గాయపడిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశాయి. ఇలాంటి దాడులకు కుట్ర చేసే వారిని, నిర్వహించే వారిని, మద్దతు ఇచ్చే వారిని చట్టం ముందు నిలపాలని సభ్య దేశాలు తేల్చి చెప్పాయి. కిరాయి పనుల కోసం ఉగ్రవాద, వేర్పాటువాద, తీవ్రవాద గ్రూపులను వాడుకునేందుకు చేసే ప్రయత్నాలు అంగీకారయోగ్యం కావని తేల్చి చెప్పాయి. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దాన్ని ఖండించాల్సిందేనని సదస్సు తీర్మానించింది. ఉగ్రవాదంపై పోరు విషయంలో ద్వంద్వ ప్రమాణాలు తగవన్న భారత్ అభిప్రాయంతో ఏకీభవించింది. సీమాంతర ఉగ్రవాదుల కదలికలు సహా ఉగ్రవాదంపై పోరాడాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చింది. భారత్ వైఖరితో సదస్సు డిక్లరేషన్ ఏకీభవించింది. ఎస్‌సీఓలో పాకిస్తాన్ కూడా సభ్య దేశమే కావడం గమనార్హం. ఈ సదస్సుకు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ హాజరయ్యారు.

ఉక్రెయిన్‌పై తాము జరుపుతున్న దాడిని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సమర్థించుకున్నారు. మూడున్నర సంవత్సరాలుగా కొనసాగుతున్న యుద్ధానికి ఆజ్యం పోసింది పశ్చిమ దేశాలేనని విమర్శించారు. 'ఉక్రెయిన్‌పై రష్యా చేసిన దాడి సంక్షోభానికి కారణం కాదు. ఉక్రెయిన్‌లో జరిగిన కుట్రే దానికి కారణం. ఆ కుట్రకు అమెరికా మద్దతు ఇచ్చింది. రెచ్చగొట్టింది' అని తేల్చిచెప్పారు. ఉక్రెయిన్‌ను నాటోలో చేర్చడానికి అమెరికా చేస్తున్న నిరంతర ప్రయత్నం కూడా ఈ పరిస్థితికి కారణమేనని స్పష్టం చేశారు. కాలం చెల్లిన యూరో కేంద్రీకృత, యూరో–అట్లాంటిక్ నమూనాల స్థానంలో అనేక దేశాలకు ప్రయోజనం కలిగించే వ్యవస్థను తీసుకురావాలని సూచించారు. ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారం కోసం భారత్, చైనా, ఇతర వ్యూహాత్మక భాగస్వాముల ప్రయత్నాలు, ప్రతిపాదనలకు అత్యంత విలువ ఇస్తామని పుతిన్ తెలిపారు.

ప్రచ్ఛన్న యుద్ధ మనస్తత్వాన్ని వ్యతిరేకించాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఎస్‌సీఓ సభ్యదేశాలను కోరారు. ప్రపంచం అస్తవ్యస్థంగా అల్లుకుపోయిన నేపథ్యంలో సభ్య దేశాలు సంక్లిష్టమైన భద్రత, అభివృద్ధికి సంబంధించి అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నాయన్నారు. 'వెనక్కి చూసుకుంటే అల్లకల్లోలంగా ఉన్న సమయంలో కూడా షాంఘై స్ఫూర్తిని ఆచరించి విజయాలు సాధించాం. భవిష్యత్‌లోకి చూస్తే ప్రస్తుతం ప్రపంచం పరివర్తనకు గురవుతోంది. కాబట్టి మనం షాంఘై స్ఫూర్తిని కొనసాగించాలి. పాదాలను నేలపై ఉంచుతూ ముందుకు సాగాలి. సంస్థ విధులను మరింత మెరుగ్గా నిర్వర్తించాలి' అని కోరారు. సమానమైన, క్రమబద్ధమైన బహుళ ధృవ ప్రపంచం కోసం సమంజసమైన ప్రపంచ పాలనా వ్యవస్థను రూపొందించడానికి సభ్య దేశాలు కృషి చేయాలని సూచించారు. ఈ ఏడాది సభ్య దేశాలకు 280 మిలియన్ డాలర్ల సాయం అందిస్తామని, ఎస్‌సీఓ బ్యాంకింగ్ కన్సార్టియంకు 1.4 బిలియన్ల రుణాన్ని ఇస్తామని ప్రకటించారు. వాణిజ్యాన్ని, పెట్టుబడుల స్థాయిని పెంచుకోవడానికి భారీ మార్కెట్‌ను ఉపయోగించుకోవాలని జిన్‌పింగ్ చెప్పారు.

# అఫ్ఘానిస్థాన్‌లో భూకంపం బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

తరలిస్తున్నారు. భూకంపాలకు అఫ్ఘనిస్థాన్ పెట్టింది పేరు. ముఖ్యంగా హిందూ కుష్ పర్వత ప్రాంతంలో ఇవి ఎక్కువగా సంభవిస్తుంటాయి. పశ్చిమ ప్రాంతంలో గత సంవత్సరం సంభవించిన భూకంపాల కారణంగా వెయ్యి మందికి పైగా చనిపోయారు.

భూకంపం ధాటికి విలవిలలాడిన అఫ్ఘనిస్థాన్‌కు ఐక్యరాజ్యసమితి అత్యవసర సాయాన్ని పంపింది. పరిస్థితి తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపింది. తమ బృందాలు ఇప్పటికే భూకంప ప్రభావిత ప్రాంతాలకు చేరుకున్నాయని, అత్యవసర సాయాన్ని అందిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడే ప్రయత్నంలో నిమగ్నమయ్యాయని చెప్పింది. 'మా ఆలోచలన్నీ బాధిత ప్రజల చుట్టూనే తిరుగుతున్నాయి' అని తెలిపింది. కాగా భారత్ కూడా అఫ్ఘనిస్థాన్‌కు మద్దతును, సంఘీభావాన్ని తెలియజేసింది. బాధిత కుటుంబాలకు ప్రధాని నరేంద్ర మోడీ సానుభూతి తెలియజేశారు. 'అఫ్ఘనిస్థాన్‌లో సంభవించిన భూకంపంలో భారీగా ప్రాణనష్టం సంభవించడం నన్ను బాధించింది. ఈ కష్టకాలంలో మా ఆలోచనలు, ప్రార్థనలు బాధిత కుటుంబాలతోనే ఉంటాయి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. బాధితులకు అవసరమైన మానవతా సాయాన్ని అందించడానికి భారత్ సిద్ధంగా ఉంది' అని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తెలిపారు. విదేశాంగ మంత్రి జైశంకర్ కూడా మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. అఫ్ఘన్‌కు సాయం చేసేందుకు ఇరాన్ కూడా ముందుకొచ్చింది.

# జాతీయ స్థాయిలో ఎన్‌ఈపీ రాష్ట్రంలో టీఈపీ

- కొత్త విద్యావిధానం రూపకల్పనకు కమిటీ
- చైర్మన్‌గా కే కేశవరావు
- అక్టోబర్ 30 నాటికి నివేదిక సమర్పించాలి
- ఉత్తర్వులు విడుదల

బలగం టీవీ, హైదరాబాద్

జాతీయ స్థాయిలో నూతన విద్యావిధానం (ఎన్‌ఈపీ)ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నది. రాష్ట్రంలో కొత్త విద్యావిధానం తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ (టీఈపీ)ని రూపకల్పన చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. తెలంగాణ రైజింగ్–2047లో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ కమిటీ చైర్మెన్‌గా ప్రభుత్వ సలహాదారు కె కేశవరావు, సభ్యులుగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, విద్యాకమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, చైర్మెన్ సిఫారసు చేసిన మరో సభ్యునితోపాటు సభ్యకార్యదర్శిగా విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ఉంటారని తెలిపారు. ఈ కమిటీ వివిధ అంశాలను పరిశీలించి అధ్యయనం చేసి అక్టోబర్ 30 నాటికి నివేదికను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలని కోరారు. జాతీయ నూతన విద్యావిధానం (ఎన్‌ఈపీ–2020)ని పరిశీలించాలనీ, రాష్ట్రానికి అనుకూలంగా ఉన్న అంశాలను అడాప్ట్ చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న విద్యావిధానం, మార్కెట్ అవసరాలు, ఉద్యోగావకాశాలు, నైపుణ్యం, ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు, డిజిటల్ రంగం, ఆవిష్కరణలు, ఎంటర్‌ప్రెన్యూర్ వంటి అంశాలను పరిశీలించాలని సూచించారు. పరిశోధనలు బలోపేతం అయ్యేలా సిఫారసలు చేయాలని కోరారు. పరిశ్రమలు, విద్యాశాఖ మధ్య పరస్పరం సహకారం ఉండేలా చూడాలని సూచించారు. పాఠశాలలు, ఉన్నత, సాంకేతిక, వృత్తివిద్యతోపాటు నైపుణ్యం, వృత్తి నైపుణ్యం వంటి అంశాల్లో సంస్కరణలుండాలని తెలిపారు. నాణ్యమైన విద్యతోపాటు అందరికీ అందుబాటులో ఉండేలా, సమానంగా అందేలా చూడాలని కోరారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం 2014, జూన్ రెండో తేదీన ఆవిర్భవించింది. పదేండ్లపాటు బీఆర్ఎస్ పాలించింది. ఇప్పటి వరకు తెలంగాణకు ప్రత్యేకంగా విద్యావిధానం రూపొందించకపోవడం గమనార్హం. రాష్ట్రంలో 2023, డిసెంబర్ ఏడో తేదీన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖను పర్యవేక్షిస్తున్నారు. గతంలో విద్యాకమిషన్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పుడు తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ (టీఈపీ)ని రూపొందించేందుకు కమిటీని నియమించారు.

# బతుకమ్మ పండుగను కార్నివాల్‌గా నిర్వహిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

దేశ విదేశాలకు తెలిసేలా ఈ పండుగ వేదిక అవుతుంది" అని తెలిపారు. పర్యాటకశాఖ, మహిళా విభాగం భాగస్వామ్యంతో వేడుకలను నిర్వహిస్తామని ఆమె అన్నారు.

# 4 ఏండ్ల స్థానికత తప్పనిసరి

(మొదటి పేజీ తరువాయి)

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. నాలుగేండ్లు తెలంగాణ వెలుపల చదివినా వైద్య కోర్సుల్లో అడ్మిషన్లు పొందేందుకు కొన్ని ప్రత్యేక కేటగిరీలకు మినహాయింపులు లభిస్తాయి.

1) రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు– తమ పిల్లలు చదివిన కాలానికి సరిపడా ఉద్యోగ కారణంగా రాష్ట్రం వెలుపల పనిచేసి ఉంటే.

2) ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్ వంటి ఆలిండియా సర్వీసెస్‌లో తెలంగాణ క్యాడర్‌కి చెందిన అధికారులు–తెలంగాణ వెలుపల విధులు నిర్వర్తించిన కాలానికి తగ్గట్టుగా మినహాయింపు.

3) రక్షణ దళాలు, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్‌లో పనిచేసే తెలంగాణా సిబ్బంది– స్వస్థలంగా తెలంగాణను డిక్లేర్ చేసి ఉంటే, ఆ కాలానికి తగ్గట్టుగా మినహాయింపు.

4) తెలంగాణ ప్రభుత్వ ఆధీనంలోని కార్పొరేషన్లు/ఏజెన్సీల్లో పనిచేసే వారు–ఉద్యోగ బదిలీల కారణంగా వెలుపల విధులు నిర్వర్తించిన కాలానికి అనుగుణంగా మినహాయింపు.

మెడికల్ కోర్సు అడ్మిషన్లలో స్థానికతకు సంబంధించి నీట్‌కు ముందు నాలుగేండ్లు స్థానికంగా చదవాలని నిబంధనలను చేర్చుతూ... తెలంగాణ ప్రభుత్వం జీవో 33ని తీసుకొచ్చింది. జీవో 33లోని నిబంధన 3 (ఏ)లో ఈ అంశాన్ని స్పష్టంగా పేర్కొన్నది. ఈ జీవోను వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌కు చెందిన కల్లూరి అభిరామ్‌తో పాటు మరో 160 మంది రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుదీర్ఘ వాదనలు విన్న ధర్మాసనం... "ఒక విద్యార్థి తెలంగాణలో నివాసం లేదా శాశ్వత నివాసి అని నిర్ధారించడానికి ప్రభుత్వం గైడ్‌లైన్స్ లేవు. మొదట గైడ్‌లైన్స్, రూల్స్ రూపొందించాలి" అని ప్రభుత్వానికి సూచిస్తు విద్యార్థులకు ఫేవర్ గా గతేడాది సెప్టెంబర్ 5న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సెప్టెంబర్ 11న తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది.

# ఓట్ల చోరీపై హైడ్రోజన్ బాంబు లాంటి

## సమాచారం విడుదల చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

చారిత్రాత్మ పోరాటాల గడ్డ బీహార్‌లో 'ఓటరు అధికార్ యాత్ర' ప్రతిపక్ష ఐక్యతకు శక్తివంతమైన ప్రదర్శనగా ముగిసింది. ఈ యాత్ర మోడీ ప్రభుత్వాన్ని కదిలించింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశం మేరకు ఎన్నికలను దెబ్బతీస్తున్న ఎన్నికల సంఘానికి పాట్నాలో లక్షలాది మంది ప్రజలు గట్టి హెచ్చరిక చేశారు. బీహార్‌లో బీజేపీ– జేడీయూ ప్రభుత్వ పునాది కదిలిపోయిందనే రాజకీయ సందేశాన్ని కూడా ఓటరు అధికార్ యాత్ర ప్రకటించింది. చంపారన్ సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఆందోళన, అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా పోరాటానికి వేదికైన పాట్నాలోని గాంధీ మైదాన్‌లో యాత్ర ముగింపు వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ యాత్ర ముగింపు కార్యక్రమంలో పాల్గొనడానికి ఆదివారం అన్ని జిల్లాల నుంచి వేలాది మంది తరలివచ్చి గాంధీ మైదాన్‌లో బస చేశారు. సోమవారం ఉదయం కూడా వివిధ కేంద్రాల నుంచి వేలాది మంది ఊరేగింపుగా గాంధీ మైదాన్‌కు తరలివచ్చారు.